సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 9 । జూలై । 2023

సండే స్పెషల్

- పూర్వ విద్యార్థుల వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- ఆత్మీయ సమ్మేళనాలే వేదికగా ఒక్కచోట చేరిక
- చదువుకున్న పాఠశాలలు, విద్యార్థులకు సామగ్రి వితరణ
- పేదలకు అండగా సేవా కార్యక్రమాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు చిన్నప్పటి దోస్తులు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం సిద్దిపేట) అంతకపేట హైస్కూల్ 1985–86 బ్యాచ్ విద్యార్థులు 65 మంది రూ.8 లక్షలకు పైగా జమ చేశారు. పాఠశాలకు సుమారు రూ.లక్షన్నరతో వేదిక నిర్మించారు. రోటరీ క్లబ్ సహాయంతో రూ.1.60 లక్షలతో విద్యార్థులకు 30 సైకిళ్లు, కుట్టు మెషిన్లు అందించాలని నిర్ణయించారు. ఏటా పదోతరగతిలో 10 జీపీఏ, ట్రిపుల్ఐటీలో సీటు సాధిస్తున్న విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. తోటి మిత్రులు నలుగురు చనిపోగా వారి కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించినట్లు కరీంనగర్ సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్ రెడ్డి, వ్యాపారి జనగామ పాపారావు తెలిపారు.

స్నేహం.. సేవతో పదిలం

వారంతా చిన్నప్పటి దోస్తులు.. పాఠశాల విద్య పూర్తయ్యాక ఉద్యోగం, వ్యాపారం, వృత్తుల్లో స్థిరపడ్డారు.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాల పేరిట చాలా ఏళ్లకు ఒక్కచోట చేరారు.. బాల్యమిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకొని, తరగతి గదిలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. వారి ఆనందానికి అవధుల్లేవు. చాలాచోట్ల ఇలాంటి కార్యక్రమాల్లో కలుస్తున్నవారు తాము చదువుకున్న పాఠశాలకు, ఊరికి, పేదరికంలో ఉన్నవారికి సాయం చేయాలనుకున్నారు.. స్కూళ్లకు, విద్యార్థులకు సామగ్రి అందిస్తూ, ఊళ్లలో పలు నిర్మాణాలు చేపడుతూ, పేదలకు అండగా నిలుస్తూ.. వారి స్నేహాన్ని కలకాలం పదిలం చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అలాంటి స్నేహితులపై 'సాక్షి' ఈ వారం సండే స్పెషల్ స్టోరీ.



తడగొండ స్నేహితుల ఔదార్యం

బోయినపల్లి(చొప్పదండి): స్థానిక హైస్కూల్ పూర్వ విద్యార్థులు, తడగొండకు చెందిన యువకులు కష్టాల్లో ఉన్న తమ స్నేహితులతోపాటు చుట్టుపక్కలవారికి సాయం చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన తమ మిత్రుడు మధుకు దాతల నుంచి సేకరించి, రూ.72,500 అందించారు. తడగొండకే చెందిన పవన్కు స్నేహితులే వైద్యం చేయించారు. అయినా అతను బతకలేదు. అంత్యక్రియలు చేసి, బాధిత కుటుంబానికి రూ.70 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇలా వారి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.



మిత్రుడి కుటుంబానికి అండ

ముస్తాబాద్(సిరిసిల్ల): స్థానిక హైస్కూల్ 1986–87 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు.. పేదరికంలో ఉన్న తమ స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. శాదుపల్లి శ్రీనివాస్గౌడ్, ఆయన తండ్రి లక్ష్మీనారాయణ గుండెపోటుతో చనిపోయారు. శ్రీనివాస్గౌడ్ కుమారుడు దివ్యాంగుడు. భార్య బీడీలు చుడుతుండగా కూతురు డిగ్రీ మధ్యలోనే మానేసింది. వీరి దీనస్థితికి చలించిపోయిన పూర్వ విద్యార్థులు శనివారం రూ.62 వేల ఆర్థికసాయం అందించారు. తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తామని దేవేందర్, హరికృష్ణ, యాదగిరిగౌడ్, శంకర్, శ్రీనివాస్, నారాయణ తెలిపారు.



బడికి బెంచీలు, వాటర్ ప్లాంట్

కోనరావుపేట(వేములవాడ): వట్టిమల్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చెప్యాల రాజు, ఎండీ.షాదుల్లా, పాలకుర్తి మహేశ్, లకావత్ రాంరెడ్డి, లక్కె సుదర్శన్, గండి నరేశ్, 2014–15 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలిసి తాము చదివిన బడికి డెస్క్ బెంచీలు అందజేశారు. ఇతరుల సహాయంతో విద్యార్థుల కోసం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.



నా నేస్తం చారిటబుల్ ట్రస్టు

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 1987–88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 2013లో నా నేస్తం చారిటబుల్ ట్రస్టును స్థాపించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి కస్తూరిబా విద్యాలయానికి స్కౌట్స్ డ్రెస్‌లు అందించారు. ఎలిగేడు, ధూళికట్ట ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి ఫలితాల్లో మొదటి, రెండో స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు ఇస్తున్నారు. ఎలిగేడు మండల నిరుద్యోగ యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ, లైసెన్స్ ఇప్పించారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ఎలిగేడులో బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట శ్రీనివాస్, వెంగళదాసు అశోక్ తెలిపారు.



ఆర్థిక సాయం.. అన్నదానం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలోని హైస్కూల్ 1986–87 బ్యాచ్ విద్యార్థులు రాజేశం, శ్యాం, శ్రీనివాస్, రవీందర్, కానుగంటి శ్రీనివాస్, కొట్టె శ్రీనివాస్ తదితరులు తమ మిత్రుడు బొంకూరి మధు కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా రూ.50 వేలు అందించారు. రామస్వామి అనే మరో స్నేహితుడికి కష్టకాలంలో నిత్యావసర సరుకులు అందజేశారు. కరోనా సమయంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుమారు 300 మంది పారిశుధ్య కార్మికులకు ఐదు కిలోల చొప్పున పండ్లు పంపిణీ చేశారు. వలస కార్మికులకు అన్నదానం చేశారు.



బాల్య స్నేహితులకు చేయూత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్థానిక జెడ్పీ హైస్కూల్ 1996–97 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు చేయూత మిత్ర ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్న తమ స్నేహితులకు రూ.5 లక్షల వరకు సాయం అందించారు. 1994–95 బ్యాచ్‌కు చెందినవారు బాల్యమిత్ర ఫౌండేషన్ ద్వారా తమ మిత్రుడు రేసు మోహన్‌కు ఉపాధి కోసం ఆటోను కొనుగోలు చేశారు. గొరిటెల కృష్ణ గుండెపోటుతో మరణించగా వారి పిల్లల పేరిట రూ.1,20,000 బ్యాంకులో డిపాజిట్ చేశామని సంస్థ అధ్యక్షుడు సందుపట్ల లక్ష్మారెడ్డి తెలిపారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత ఎన్నారైలు సతీశ్, రుక్మయ్య, రమేశ్, ప్రదీప్, అశోక్ పాఠశాల అభివృద్ధికి దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేశారు.



విద్యార్థి దత్తత కార్యక్రమం

ధర్మపురి: ధర్మపురికి చెందిన గొల్లపల్లి గణేశ్ దివ్యాంగుడు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల (గతంలో యూపీఎస్)లో చదివి, అదే స్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేస్తున్నారు. నిరుపేద విద్యార్థులు చదువుల్లో రాణించడానికి విద్యార్థి దత్తత అనే కార్యక్రమం ద్వారా చేయూతనిస్తున్నారు. దీనికి ధర్మపురికి చెందిన ఆయన మిత్ర బృందంతోపాటు ఎన్నారైలు సాయం చేస్తున్నారు. ఇప్పటివరకు 2,500 మంది నిరుపేద విద్యార్థులకు సుమారు రూ.15 లక్షల విలువైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఏడుగురు విద్యార్థినుల ఉన్నత విద్యాభ్యాసానికి సుమారు రూ.16 లక్షలు చెల్లించారు.



సమస్యలపై ఆరా.. తక్షణ స్పందన

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ హైస్కూల్ పూర్వ విద్యార్థి, బీర్‌పూర్‌కే చెందిన చిట్నేని విజయ్‌కుమార్ పాఠశాల పూర్వ విద్యార్థులు 150 మందితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. అందరూ ఎక్కడ ఏ సమస్య ఉందని ఆరా తీస్తూ తక్షణమే సాయం చేస్తున్నారు. బీర్‌పూర్‌కు డెడ్‌బాడీ ఫ్రీజర్ అందించారు. బడిలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. నలుగురు పేద విద్యార్థులకు రూ.50 వేల చొప్పున అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని విజయ్‌కుమార్, వేణు తెలిపారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

కోరుట్ల రూరల్: పెద్దాపూర్ గురుకుల పూర్వ విద్యార్థి, వ్యాపారి చెన్నమనేని శ్రీనివాసరావు తాను చదువుకున్న విద్యాలయంలో విద్యార్థుల కోసం రూ.10 లక్షలతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మించారు. పాఠశాల అభివృద్ధి కోసం 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులతో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి, సొంత ఖర్చులతో సిల్వర్ జూబ్లీ నిర్వహించారు. పూర్వ విద్యార్థులు గురుకులంలో వాటర్ ప్లాంట్ నిర్మించారు. విద్యార్థుల కోసం డెస్క్ బెంచీలు అందజేశారు.

రూ.20 లక్షలతో తరగతి గదులు



కోనరావుపేట(వేములవాడ): నిజామాబాద్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులందరూ కలిసి పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి రిటైర్డ్ డీఎస్పీ గోగూరి మోహన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నారు. పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని తెలుసుకొని, రూ.20 లక్షలతో రెండు గదులు నిర్మించారు. వాటిని 2022 డిసెంబర్ 2న అప్పటి సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, డీఈవో రాధాకిషన్ చేతులమీదుగా ప్రారంభించారు.

రాజన్నకు మొక్కులు

- దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి గోపాలకృష్ణారావు
- స్వాగతం పలికిన ఆలయ అధికారులు



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జికి ప్రసాదాలు అందజేత



దర్శనానికి బారులుతీరిన భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణల అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి అద్దాల మండపంలో ఏఈవో శ్రీనివాస్ ప్రసాదాలు అందించారు. ఏఎస్పీ చంద్రయ్య, ఇన్‌చార్జి డీఎస్పీ విశ్వప్రసాద్, ఆర్డీవో పవన్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, టౌన్ సీఐ వెంకటేశ్, పర్యవేక్షకులు తిరుపతిరావు, సిరిగిరి శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న10వేల మంది

రాజన్నను శనివారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అనుబంధ బద్దిపోచమ్మ, భీమన్న ఆలయాలను సందర్శించారు. భక్తుల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు రాము, నాయకులు



వేములవాడలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జోహార్ వైఎస్సార్

వేములవాడ/సిరిసిల్లటౌన్: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో గూడు కట్టుకుని ఉన్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వేములవాడలోని తన నివాసంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పేదల పెన్నిధిగా ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచి ఉన్నారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము పేర్కొన్నారు. సిరిసిల్లలోని గాంధీచౌక్‌లో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీచౌక్‌లో పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. వైఎస్ఆర్‌టీపీ నాయకులు అనుముల శ్రీకాంత్‌రెడ్డి, గజ్జెల దేవరాజు, జింక ఎల్లయ్య, వంగరి అనిల్, రాజు, ప్రశాంత్, సత్యం, వేములవాడలో సాగారం వెంకటస్వామి, పిల్లి కనకయ్య, సంగ స్వామియాదవ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మిడ్‌మానేరులో 15 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 15.997 టీఎంసీలకు చేరింది. ఎల్ఎండీలోకి శనివారం ఒక్క గేటు ద్వారా 280 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

వర్షం.. హర్షం



వేములవాడ: వేములవాడలో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. వర్షాలు లేక రైతులు అల్లాడుతున్న క్రమంలో వాన కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక పంట పనులు జోరందుకోనున్నాయి.

రజకుల ఉపాధి కల్పనపై కృతజ్ఞతలు



వినోద్‌కుమార్‌ను కలిసిన రజక సంఘం నాయకులు

సిరిసిల్ల: రజకులకు శాశ్వత ఉపాధికి జీవో 102 జారీ చేయించిన ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. వినోద్‌కుమార్‌ను హైదరాబాద్‌లో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో బట్టలను ఉతికే కాంట్రాక్టులను రజకుల సంఘాలకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. రజకులకు దీర్ఘకాలిక ఉపాధికి జీవో ఇప్పించిన వినోద్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, నాయకులు కుమారస్వామి, కనకయ్య, రాజు తదితరులు ఉన్నారు.

బోయినపల్లి(వేములవాడ): ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో మండల నాయకులు కలిశారు. కరీంనగర్ అభివృద్ధి విషయంలో విదేశీ పర్యటన చేసి రావడాన్ని పురస్కరించుకొని సన్మానించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, ఐరెడ్డి మల్లారెడ్డి ఉన్నారు.

సపాయిలపై కక్ష సాధింపు సిగ్గుచేటు



కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): సపాయి కార్మికులపై బీఆర్ఎస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల శిబిరాన్ని మూడోరోజు శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా వేతనాలు పెంచాలని పలుమార్లు సమ్మె చేస్తే సీఎం కేసీఆర్ హామీలు ఇచ్చి మోసం చేశాడన్నారు. ఎన్ని సమ్మెలు చేసిన కార్మికులను ఆదుకున్న పాపాన ఈ ప్రభుత్వం పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ ఏనాడు పంచాయతీ కార్మికుల గురించి ఆలోచించలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రాములు, ఎంపీటీసీ శ్రీనివాస్, మహేశ్ రెడ్డి, గజ్జెల రాజు, విజయ్‌రెడ్డి, రాకేశ్ ఉన్నారు.

ఘనంగా శాకంబరి ఉత్సవాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆషాఢం సందర్భంగా శనివారం వేదపండితుడు గౌతమ్‌శర్మ ఆధ్వర్యంలో శాకంబరీ ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల కూరగాయాలతో తయారుచేసిన దండలతో అలంకరించారు.

క్లుప్తంగా

రెడ్డి సంఘానికి స్థలం కేటాయించండి



ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో సమావేశమైన డివిజన్ రెడ్డి సంఘం నాయకులు

వేములవాడ: వేములవాడ డివిజన్ రెడ్డి సంఘానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు, సభ్యులు శనివారం ఎమ్మెల్యే రమేశ్‌బాబును శనివారం కలిసి విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను రెడ్డి సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు.

దేవయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం



దేవయ్యకు నివాళి అర్పిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన కోనేటి దేవయ్య గుండెపోటుతో మరణించగా.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. దేవయ్య కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. మంత్రి కేటీఆర్ సహకారంతో కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. నాయకులు పందిర్ల పర్శరాములుగౌడ్, ఎడ్ల సందీప్, శివరామకృష్ణ, ఎడ్ల లక్ష్మణ్, కళ్యాణ్ ఉన్నారు.

మాలలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రాంచంద్రం

సిరిసిల్లటౌన్: దళితబంధు పథకంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ సామాజిక వర్గం, ఉపకులాల వారిని పూర్తిగా విస్మరిస్తుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రాంచంద్రం పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దళితబంధు పథకంలో మాలలు, ఉపకులాల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మాలలపై వివక్షను నిరసిస్తూ ఈనెల 14న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి శ్రీనివాస్, నాయకులు నక్క పర్శరాములు, మంగ కిరణ్, పండుగ శేఖర్, రెడ్డిమల్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మైలారం నర్సయ్య కుటుంబానికి తోటి విద్యార్థులు చేయూతనందించారు. నర్సయ్య ఇటీవల గల్ఫ్‌లో మృతిచెందాడు. 1997–98 బ్యాచ్ విద్యార్థులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందించారు. బొల్లారం తిరుపతి, దుమాల శ్రీధర్, జంగిటి శ్రీనివాస్, ఆసరి అంజయ్య, కీసరి రామచంద్రం ఉన్నారు.

జోరుగా వడ్డీ వ్యాపారం

- వేములవాడలో రెచ్చిపోతున్న వడ్డీ మాఫియా
- అప్పు చెల్లించకుంటే ఆస్తుల రిజిస్ట్రేషన్
- దాడులకు దిగుతున్న వైనం
- పోలీసుల దాడులతో వ్యాపారుల బెంబేలు
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు



వేములవాడలోని ఓ చిట్‌ఫండ్ కంపెనీలో తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటేశ్, పోలీసులు (ఫైల్)

వేములవాడ: నిరుపేద, మధ్య తరగతి ప్రజల అవసరాలే లక్ష్యంగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. వడ్డీ మీద వడ్డీ వసూలు చేస్తూ పేదలను అప్పుల ఊబిలోకి నెట్టుతున్నారు. రైతులు, ఆటోవాలాలు, చిరువ్యాపారులు అవసరం కోసం వెళ్తే జలగల్లా తగులుతున్నారు. అధిక వడ్డీ వసూలు చేస్తూ.. చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న వారిని బెదిరింపులకు పాల్పడుతూ ఆస్తులను రాయించుకుంటున్నారు. ఇటీవల వేములవాడలో పోలీసులు జరిపిన దాడుల్లో భారీ ఎత్తున నగదు పట్టుబడడంతోపాటు ప్రామిసరీ నోట్స్, ఖాళీ చెక్కులు దొరికాయి.

అడ్డగోలుగా వడ్డీ వసూలు

వేములవాడలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. బయటకు ఉచిత సేవ చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్న చాలా మందిలో అధిక వడ్డీ వ్యాపారులే ఉండడం గమనార్హం. ఇళ్లు, దుకాణాలు, భూములను తాకట్టు పెట్టుకొని రుణాలు ఇస్తున్నట్లు ఇటీవల పోలీసుల దాడుల్లో తెలిసింది. వడ్డీ పెరిగి అప్పు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న వారు తాకట్టు పెట్టిన బంగారం, భూములను సొంతం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

జోరుగా ఫైనాన్స్ వ్యాపారం

వేములవాడ పట్టణంలో ప్రైవేట్ ఫైనాన్సులు, డెయిలీ ఫైనాన్సులు అడ్డగోలుగా నడుస్తున్నాయి. చిరువ్యాపారులే లక్ష్యంగా వీరు వ్యాపారం చేస్తున్నారు. మూడు ప్రామిసరీ నోట్లు.. నాలుగు రిజిస్ట్రేషన్లుగా వడ్డీ వ్యాపారం సాగుతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే.. ఎలాంటి నిబంధనలు పాటించకుండానే వ్యాపారం జోరుగా సాగుతోంది. పట్టణంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తే నిత్యం దుకాణాల్లోకి వెళ్లి డబ్బులు వసూలు చేసే వీరి బాగోతం బట్టబయలు కానుందని ఎస్పీకి బాధితులు సమాచారం అందించినట్లు తెలిసింది.

మచ్చుకు కొన్ని సంఘటనలు

- వేములవాడకు చెందిన ఒకరు రూ.కోటి విలువైన వ్యవసాయ భూమిని రూ.30 లక్షలు అప్పు కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తన భూమిని అమ్ముకునే క్రమంలో అధిక లాభం రావాలంటూ ఇబ్బందులు పెట్టసాగారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు జోక్యం చేసుకోవడంతో కిమ్మనకుండా ఆ వడ్డీ వ్యాపారి తన పేరుతో ఉన్న భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాడు.
- రాజన్న భక్తులు తిరిగే జాతరగ్రౌండ్ ప్రాంతంలోని చిరువ్యాపారం చేసుకుంటున్న ఒకరు రూ.3.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. ప్రతీ రోజు అప్పు చెల్లిస్తూనే ఉన్నాడు. కొద్ది రోజులుగా వ్యాపారం సరిగ్గా నడవక, అనారోగ్యం కారణంగా అప్పు చెల్లించడంలో ఆలస్యమైంది. ఏకంగా సదరు వ్యక్తికి చెందిన ఇంటిని రూ.12 లక్షలకు ధర చేసుకుని అక్రమ వడ్డీ వ్యాపారి సొంతం చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది.
- బైపాస్‌రోడ్డులోని ఓ వ్యక్తికి రెండు గుంటల స్థలాన్ని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని రూ.32 లక్షలు అప్పుగా ఇచ్చారు. ఇందుకు రూ.3 చొప్పున వడ్డీ ఖరారు చేసుకున్నాడొక అక్రమ వడ్డీ వ్యాపారి. అనంతరం ఏడాదిన్నర వరకు మిత్తి పెరిగిపోవడంతో సదరు వ్యక్తికి చెందిన భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. అప్పు తీసుకున్న కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండిపోతోంది.
- వేములవాడలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తి తన కుమారుడి ఉన్నత చదువుల కోసం వడ్డీ వ్యాపారి వద్ద రూ.1.40 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని ఇబ్బంది పెట్టడంతో ఇంటి దస్తావేజులు తాకట్టు పెట్టినట్లు తెలిసింది. ఆర్నెళ్ల వరకు వేచి చూసిన సదరు అక్రమ వడ్డీ వ్యాపారి ప్రస్తుతం ఆ ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిరంతరం దాడులు చేస్తాం



వేములవాడలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోందని ఠాణా దివస్ ద్వారా ఎస్పీ దృష్టికెళ్లింది. ఎస్పీ ఆదేశాలతో వడ్డీవ్యాపారుల ఇళ్లు, దుకాణాలపై దాడులు చేసి పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నాం. దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. బాధితులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా సరే చట్టానికి లోబడే వ్యాపారం చేసుకోవాలి.

– వెంకటేశ్, వేములవాడ టౌన్ సీఐ

బీఆర్‌ఎస్, బీజేపీ రహస్య ఒప్పందం

- సింగరేణి, మినరల్ ఫండ్స్‌పై విచారణ జరపాలి
- పార్టీ ఫండ్ ఇస్తే ప్రైవేట్ వర్సిటీలకు అనుమతులు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండంలోని టీవీ గార్డెన్స్‌లో రామగుండం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశం కోసం, ధర్మం కోసం అనడం మానుకుని ముందుగా బీజేపీ నాయకులకు సంస్కారం నేర్పించాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లో ఆదివాసి వ్యక్తిపై మూత్రవిసర్జన చేసిన, కులమతాల పేరుతో అసమానతలు సృష్టిస్తున్నందుకు ప్రధాని దేశానికి క్షమాపణలు చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వెంటనే యూనిఫాం సివిల్ కోడ్ వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశా రు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో సింగరేణి, జిల్లా మినరల్ ఫండ్స్ గురించి విచారణ జరిపించాలని కోరారు. సింగరేణి నిధులకు.. గజ్వేల్ జిల్లాకు ఏం సంబంధమని, సీఎం కేసీఆర్ తన నియోజకవర్గానికి ఎందుకు నిధులు తరలించుకుపోతున్నారని ప్రశ్నించారు. పార్టీ ఫండ్ ఇచ్చిన వారికి ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో పేదరికం, నిరుద్యోగం, దోపిడీ, కబ్జాలు, అనుమతి లేని వర్సిటీలు, కుంభకోణాలే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ వచ్చాకా ఆంధ్రప్రాంతం నాయకులకే కాంట్రాక్టులు దక్కుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి అవినీతిలో ఎమ్మెల్యేలందరికీ పాత్ర ఉందని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఇసుకదందా విపరీతంగా సాగుతోందని వివరించారు. బీఎస్పీ నాయకుడు దేవునూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన చిలుక రాంమూర్తి, ఎండీ.పాషాకు కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్, అధ్యక్షుడు కాసిపేట స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజనర్సయ్య, పంజాబాల కల్యాణ్, జింక ఉదయ్, జనగామ మల్లేశ్, విజయగిరి రాము, సిరికొండ సది, కాసర్ల పోశమల్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మండలంలోని రాచర్లగుండారం, తిమ్మాపూర్, బాకూర్‌పల్లి, రాజన్నపేట, కిష్టునాయక్ తండాల్లో శనివారం కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆగయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి వంద మందికి ఒక బూత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు బూత్‌ల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, సర్పంచులు శంకర్‌నాయక్, పడిగెల రవీందర్, అజ్మీరా మంజుల, పెంటయ్య, నాయకులు ఎలుసాని మోహన్‌కుమార్, అందె సుభాష్, కిషన్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించండి

- బాధితురాలు లక్ష్మి

వేములవాడఅర్బన్: పునరావాసకాలనీలో పట్టా, కుటుంబ ప్యాకేజీ ఇప్పిస్తానని సంకెపల్లికి చెందిన ఓ వ్యక్తి తమ వద్ద రూ.40వేలు తీసుకుని మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన వల్లంపట్ల లక్ష్మి ఆరోపించింది. తనకు జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శుక్రవారం వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడింది. సంకెపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంటి పట్టా, కుటుంబ ప్యాకేజీ ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని ఇప్పించకుండా, డబ్బులు తిరిగివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని వేడుకుంటుంది. అప్పు చేసి డబ్బులు ఇచ్చానని, తనకు న్యాయం చేయాలని కోరుతుంది. అధికారులు స్పందించి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని వేడుకుంటుంది.

పాత్రికేయులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: పాత్రికేయులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. 'మానేరు స్వచ్ఛంద సంస్థ', సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ యశోద ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగావైద్యశిబిరం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు సామాజిక దృక్పథంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈసీజీ, 2డీ ఎకో, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మానేరు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చింతోజు భాస్కర్, వైద్యులు స్వప్న, సందీప్, వెంకటాచలం, అభినయ్, సంతోష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్, కోశాధికారి కాయితి మహేందర్, కాంభోజు ముత్యం, శిరీష, దయానంద్, నాయిని బాబు, రమేశ్, అన్సార్‌అలీ, మిట్టపల్లి కాశీనాథ్, తడుక విశ్వనాథం, రాపెల్లి సంతోష్, ప్రదాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వేములవాడఅర్బన్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. సమ్మయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, పెన్షన్ గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కల్లూరు చందన, మమత, పద్మ, శ్యామల, అంజలి, వాణి, మంజుల, జ్యోతి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

కంచర్లలో దొంగతనం

- రూ.1.50 లక్షలు, తులం బంగారం మాయం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నవత

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం కంచర్లలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన బండి నాగలక్ష్మి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. శనివారం ఉదయం తిరిగిరాగా.. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానంతో లోనికి వెళిచూడగా.. రూ.1.50 లక్షలు, తులం బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. వెంటనే వీర్నపల్లిలోని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై నవత సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించింది. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్, టవర్‌డంప్‌లసహాయంతో క్లూస్‌టీమ్ సేకరించింది.

కేన్సర్‌తో మహిళ మృతి

- చందాలతో అంత్యక్రియలు



సుంకి శారద (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన సుంకి శారద(40) కేన్సర్‌తో శుక్రవారం రాత్రి మృతిచెందింది. కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటోంది. జబ్బు నయం కాకపోవడంతో పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయింది. ఆమె కొడుకు గణేష్(23) వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తుండగా, కూతురు శాలిని(12) ఏడో తరగతి చదువుతోంది. సొంతిల్లు కూడా లేకుండా నిరుపేద స్థితిలో ఉండడంతో పలువురు దాతలు ఆర్థికసాయం చేసి దహన సంస్కారాలు పూర్తి చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కారు బోల్తా

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రం శివారులోని తెర్లుమద్ది క్రాసింగ్ వద్ద శనివారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సంజయ్ మరొకరితో కలిసి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటకు కారులో బయలుదేరారు. ముస్తాబాద్ శివారులోని తెర్లుమద్ది క్రాసింగ్ వద్దకు చేరుకోగానే కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సంజయ్ చేయి విరిగిపోగా అతడి స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

మిత్రుల కుటుంబాలకు చేయూత



సాయం అందిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన మోసి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా స్థానిక దోస్త్ యూత్ మిత్రులు శని వారం వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. సభ్యులు చందనం శివరామకృష్ణ, విజయ్, కుమార్, రాజు, రవి, కిరణ్, భగత్ ఉన్నారు.

రైతుల అభివృద్ధికే ప్రాధాన్యం

సిరిసిల్లటౌన్: రైతుల అభివృద్ధికి భారతీయ కిసాన్ సంఘ్ నిరంతరం పోరాడుతుందని సంఘ్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్ అన్నారు. సిరిసిల్లలోని సంఘ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కిసాన్ సంఘ్ పోరాట ఫలితంగానే రైతులకు పంట నష్టపరిహారం అందించడానికి ప్రభుత్వం రూ.304 కోట్ల మంజూరుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జోగినపల్లి సంపత్‌రావు, బియ్యంకార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికునికి సన్మానం



గీత కార్మికుడు పర్శరాములుకు సన్మానం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాలలో తాటి చెట్టుపై చిక్కుకున్న ఆరేటి రాములును కాపాడిన ఆరేటి పర్శరాములును తెలంగాణ వివేక రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. సంఘం అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం రాములు తాటిచెట్టుపైన మోకు జారీ తలకిందులు కాగా, ప్రాణాలకు తెగించి పర్శరాములు చెట్టుపైకి ఎక్కి రాములును కాపాడడం అభినందనీయమన్నారు. జిల్లా కార్యదర్శి దుంపెన రమేశ్, నాయకులు బండారి బాల్‌రెడ్డి, ఎల్లాగౌడ్, అంజయ్య, నాంపల్లి, లక్ష్మణ్, బాలకిషన్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీకి ఎంపీటీసీ రాజీనామా

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని కందికట్కూర్ ఎంపీటీసీ దొమ్మాటి కిశోర్‌గౌడ్ బీజేపీకి శనివారం రాజీనామా చేశారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ వైద్యుడు అయిట్ల బాలరాజు పేర్కొన్నారు. సిరిసిల్లకు చెందిన హిమాన్షి పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 20 ఏళ్లలోపు వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్లు తెలిపారు. నిమ్మపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

వన్యప్రాణుల వేటగాడిపై పీడీ యాక్టు

- కటకటాలకు పంపిన పోలీసులు
- వన్యప్రాణుల వేటకు కరెంట్‌షాక్
- ఇదే ప్రమాదంలో ఒకరు మృతి



దేవరాజుకు పీడీయాక్ట్ పత్రాలు అందిస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: అటవీ ప్రాంతంలో కరెంట్‌షాక్ పెట్టి వన్యప్రాణులను వేటాడేందుకు ప్రయత్నించిన వ్యక్తి విధానాలతో ఒకరు ప్రాణాలు కోల్పోవడంతో ఆ వేటగాడిపై పీడీయాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. వేటగాడిని కోర్టు ఆదేశానుసారం కటకటాలకు పంపినట్లు వెల్లడించారు. చందుర్తి మండలం బండపల్లికి చెందిన పల్లపు దేవరాజు కోనరావుపేట మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో వన్యప్రాణులను వేటాడేందుకు కరెంట్‌షాక్ పెట్టి, రైతులను హాని కలిగిస్తున్నారని వివరించారు. పంట పొలాల దగ్గరలో కరెంట్ వైర్లతో షాక్‌పెట్టగా కొన్ని నెలల క్రితం ఒకరి మరణానికి కారమయ్యాడని తెలిపారు. ఈ నేపథ్యంలో దేవరాజుపై పీడీయాక్టు నమోదు చేసినట్లు చెప్పారు. కోర్టు ఆదేశాలతో శనివారం చర్లపల్లి జైలుకు తరలించారు. కేసు నమోదులో కృషిచేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ రమాకాంత్‌ను ఎస్పీ అభినందించారు.

రహదారిపై పడిన గ్రానైట్ రాళ్లు

- తప్పిన ప్రమాదం



కొండగట్టు: కరీంనగర్–జగిత్యాల హైవేపై ఘోర ప్రమాదం తప్పింది. శనివారం కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామశివారులో గ్రానైట్ రాళ్లను తీసుకెళ్తున్న లారీ ఓవర్‌లోడ్‌తో ట్రాలీ నుంచి విడిపోయింది. ట్రాలీలో ఉన్న పెద్ద గ్రానైట్ రాళ్లు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో ట్రాఫిక్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లడం వల్లనే ఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

అధైర్యపడకండి.. అండగా నిలుస్తాం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

చందుర్తి(వేములవాడ): గల్ఫ్ బాటలో మృతిచెందిన చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన ఆది మల్లయ్య కుటుంబ సభ్యులను, తిమ్మాపూర్‌లో గుండెపోటుతో చనిపోయిన కూరగాయల వ్యాపారి పాతీ రాజు కుటుంబీకులను శుక్రవారం పరామర్శించారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, చందుర్తి డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, మ్యాకల రవి, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.